సాక్షి
నంద్యాల
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



పచ్చళ్ల తయారీపై శిక్షణ

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం పచ్చళ్ల తయారీపై మహిళలకు శిక్షణ ప్రారంభమైంది. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ పాల్గొన్నారు.



ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి శుక్రవారం పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.



రూ.13 లక్షలు సీజ్

బనగానపల్లె పట్టణంలోని అవుకుమెట్ట సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఎలాంటి ఆధారాలు లేని రూ.13 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



సంజామల ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

సంజామల: రోగులకు సేవలు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.ఆర్. వెంకట రమణ అన్నారు. సంజామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ.. ఓపీకి వచ్చినటువంటి రోగులకు సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాతా శిశు సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంఎల్‌హెచ్‌పీ, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. దీర్ఘకాలిక జబ్బులున్నటువంటి రోగులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



గోవిందపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ అబ్జర్వర్

శిరివెళ్ల: గోవిందపల్లె, యర్రగుంట్ల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆళ్లగడ్డ, బనగానపల్లె నియోజక వర్గ కేంద్ర ఎన్నికల జనరల్ పరిశీలకుడు దినేష్‌కుమార్ పరిశీలించారు. కేంద్రాలలోని బూతులు, ఓటర్ల వివరాలు, తాగునీరు, విద్యుత్ సదుపాలయాలపై ఆరా తీశారు. గోవిందపల్లె గ్రామ సచివాలయంలోకి వెళ్లి శాఖల వారీగా సిబ్బంది వివరాలు, విధులను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలను తీశారు. ఆయన వెంట తహసీల్దార్, కులశేఖర్, వీఆర్వోలు, బూతు లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 27న శనివారం పాలిసెట్–2024 పరీక్షను సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. శుక్ర వా రం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని నంద్యాల, బేతంచెర్ల, శ్రీశైలం, పాలిటెక్నిక్ కళాశాలల ఆధ్వర్యంలో 18 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 5, 460 మంది విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సూపర్–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.13,000, మధ్యస్థ ధర రూ.11,300, కనిష్ట ధర రూ.9,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,300, మధ్యస్థ ధర రూ.5,700, కనిష్ట ధర రూ.4,500గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు.

పాతాళ గంగ పలకరించె.. మెట్ట పులకరించె!

మెట్టభూముల్లో జల సిరులు ఉప్పొంగుతూ రైతు కుటుంబాల్లో ఆనందం నింపుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశ పెట్టి అన్నదాతలకు అండగా నిలిచారు. కనిష్టంగా 2.5 ఎకరాల నుంచి గరిష్టంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేసింది. విద్యుత్ మోటారు, ఇతర మెటీరియల్‌ను కూడా అందజేస్తోంది. జలకళ బోర్లకు పంపుసెట్లు అమర్చడంతో రెండు పంటలు పండించుకునే వెసలుబాటు లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జలకళ పథకం కింద బోరు వేస్తున్న దృశ్యం (ఫైల్)

- వైఎస్సార్ జలకళ పథకంతో 2,146 బోర్ల తవ్వకాలు
- సన్నకారు రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు
- మెట్ట భూములు సస్యశ్యామలం
- ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం

కోవెలకుంట్ల: రైతులు సాగునీటి కోసం పడుతున్న కష్టాలను ప్రజా సంకల్ప పాదయాత్రలో గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. ఓ వైపు సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తూనే మరో వైపు మెట్ట భూముల రైతులను ఆదుకునేలా వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2020 సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతుల పొలాల్లో ఉచితంగా బోర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మెట్ట ప్రాంతాల్లో జలసిరులు కురుస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసి సాగునీరు అందిస్తుండటంతో కర్షకులు ఖుషీ అవుతున్నారు. ఈ పథకం ద్వారా రైతుల పొలాల్లో ప్రభుత్వం ఉచితంగా బోర్లు తవ్విస్తోంది. ఐదు ఎకరాల్లోపు మెట్టపొలం కలిగిన రైతులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. మాగాణి పొలాలు ఉన్న రైతులు పథకానికి అనర్హులు. రైతులు దరఖాస్తు చేసుకున్నాక జియాలజిస్ట్ అధికారులు బోరు నిర్మాణానికి సర్వే నిర్వహించి స్థలాన్ని గుర్తిస్తారు. తర్వాత బోర్ల నిర్మాణానికి ఎస్టిమేట్ వేసి మంజూరుకు ప్రతిపాదనలు పంపగా మంజూరైన తర్వాత ప్రాధాన్యత క్రమంలో రైతుల తోటలు, పొలాల్లో బోర్లు నిర్మిస్తారు. బోరు ఏర్పాటుకు రైతులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. కేసింగ్ పైపులతో సహా సుమారు 350 అడుగుల వరకు డ్రిల్లింగ్ చేయడం ఈ పథకం ప్రత్యేకత. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ఇప్పటి వరకు 2,146 బోర్లు వేశారు. ఇందుకోసం రూ. 5.18 కోట్ల నిధులు వెచ్చించారు. రైతుల పొలాల్లో బోరు వేయడంతో పాటు మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. బోర్లు వేసుకున్న రైతులు సాగునీరు మళ్లించుకుని ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

మెట్ట ప్రాంత రైతులకు వరం

వైఎస్సార్ జలకళ పథకం మెట్ట ప్రాంత రైతులకు వరంగా మారింది. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో కొన్నేళ్ల నుంచి రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాధారంగా రైతులు మినుము, పెసర, కంది, పప్పుశనగ, ఆముదం, ముంగారి పత్తి, తదితర పంటలను పండిస్తున్నారు. పైరు వివిధ దశల్లో వరుణుడు కరుణిస్తే పంటలు చేతికందేవి. స్వతహాగా బోరు వేయించుకోవాలన్నా మోటారు, విద్యుత్ సౌకర్యంతో కలుపుకుని రూ. 4 లక్షల వరకు వెచ్చించాల్సి ఉండటంతో అంత డబ్బులతో బోరు వేయించుకోలేక మెట్ట పంటల ఆధారంగా కాలం వెల్లదీస్తూ వచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైఎస్సార్ జలకళ పథకం అమల్లోకి రావడంతో రైతుల దశ తిరిగింది. ప్రభుత్వమే ఉచితంగా బోరు ఏర్పాటు చేయడంతోపాటు మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలమవుతున్నాయి. బోర్ల ద్వారా సాగునీరు అందుతుండటంతో రైతులు మెట్ట పొలాల్లో వరి, పత్తి, మిరప, తదితర పంటలతోపాటు ఉద్యానవన పంటలైన నిమ్మ, చీనీ, జామ, సపోట, తదితర పంటలు సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధిస్తూ ఆర్థిక బలోపేతం అవుతున్నారు.

జిల్లాలో క్లస్టర్ల వారీగా జలకళ బోర్ల వివరాలు

క్లస్టర్	బోర్ల మంజూరు	ఇప్పటి వరకు వేసినవి	ఖర్చు
ఆత్మకూరు	324	242	రూ. 44.03 లక్షలు
డోన్	1,884	1,260	రూ. 3.33 కోట్లు
కోవెలకుంట్ల	797	509	రూ. 1.28 కోట్లు
నంద్యాల	234	135	రూ. 40.54 లక్షలు

మిరప సాగు చేశా

నాలుగు ఎకరాల సొంత పొలం ఉండగా 2021 సంవత్సరానికి ముందు పప్పుశనగ, ధనియాలు, తదితర మెట్ట పంటలు సాగు చేసేవాళ్లం. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా పొలంలో బోరు వేయడంతో ఆ ఏడాది నుంచి మిరప పంట వేస్తున్నాం. సాగునీరు పుష్కలంగా ఉండటంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. రైతులను ఆదుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– సరస్వతి, మహిళా రైతు, ఆకుమల్ల, సంజామల మండలం



జిల్లాలో జలకళ పథకం వివరాలు

దరఖాస్తు చేసుకున్న రైతులు	17,820
జియాలజిస్ట్‌లు సర్వే చేసిన రైతుల సంఖ్య	4,633
బోర్ల మంజూరుకు ప్రతిపాదనలు	3,729
బోర్ల నిర్మాణానికి ఎస్టిమేట్	3,302
మంజూరైనవి	3,249
ఇప్పటి వరకు వేసినవి	2,146

రైతులకు ఎంతో మేలు



నాకు 2.50 ఎకరాల సొంత పొలం ఉంది. ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఉచితంగా బోరు ఏర్పాటు చేసింది. బోరుతోపాటు మోటారు, విద్యుత్ కనెక్షన్‌తో ఇచ్చారు. నాలాంటి మెట్ట ప్రాంత రైతులకు జలకళ పథకం వరంగా మారింది. ఏటా రెండు పంటలు సాగు చేసుకుంటున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసింది. – నడిపి రామిరెడ్డి, రైతు, మదనంతపురం, కొలిమిగుండ్ల మండలం

సీఎం రైతుల పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా నిలిచారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం మొదలు కొని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో తెచ్చారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వమే విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మెట్ట పొలాలకు సాగునీరు అందించేందుకు జలకళ పథకాన్ని అమలు చేసి అండగా నిలిచారు. – తిమ్మయ్య, రైతు, ఆకుమల్ల, సంజామల మండలం

పకడ్బందీగా నామినేషన్ల పరిశీలన

- 204 నామినేషన్లు ఆమోదం, 61 తిరస్కరణ



కలెక్టరేట్‌లో ఎంపీ అభ్యర్థుల నామినేషన్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు వేసిన నామినేషన్లను శుక్రవారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. జిల్లాలో నంద్యాల పార్లమెంట్ స్థానంతో పాటు నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె నియోజకవర్గాల్లో నామినేషన్లను పకడ్బందీగా పరిశీలించారు. వివరాలు సక్రమంగా లేకపోవడంతో 61 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ప్రస్తుతానికి పోటీలో 204 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధాన పార్టీలైన వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ అభ్యర్థులందరీ నామినేషన్లకు అధికారులు ఆమోదం తెలిపారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు మొత్తం 208 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించి 169 ఆమోదించారు. 39 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చు. 29వ తేదీ సాయంత్రం తుది జాబితా విడుదలవుతుంది. అభ్యర్థులకు అదే రోజు గుర్తులను కేటాయిస్తారు. నంద్యాల పార్లమెంట్ స్థానానికి సంబంధించి 57 నామినేషన్లు రాగా అందులో 35 ఆమోదం పొందగా 22 నామినేషన్లు తిరస్కరించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు అయిన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి (వైఎస్సార్‌సీపీ), బైరెడ్డి శబరి(టీడీపీ) నామినేషన్లను ఆమోదించారు.

జిల్లాలో నామినేషన్ల స్క్రూటిని వివరాలు

నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	తిరస్కరణ గురైనవి	ఆమోదం పొందినవి
నంద్యాల పార్లమెంట్	57	22	35
శ్రీశైలం	24	5	19
ఆళ్లగడ్డ	21	2	19
నంద్యాల	41	10	31
డోన్	33	2	31
నందికొట్కూరు	47	15	32
బనగానపల్లె	42	5	37

➡ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 41 నామినేషన్లు దాఖలు కాగా అందులో 31 ఆమోదం పొందగా 10 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఫరూక్‌ల నామినేషన్లు ఆమోదించారు.

➡ శ్రీశైలం నియోజకవర్గంలో 24 నామినేషన్లు దాఖలు కాగా అందులో 19 ఆమోదం పొందగా 5 తిరస్కరణకు గురయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డిల నామినేషన్లు ఆమోదించారు.

➡ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 21 నామినేషన్లు దాఖలు కాగా 19 నామినేషన్లు ఆమోదం పొందగా 2 నామినేషన్లు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమా అఖిల ప్రియ నామినేషన్లు ఆమోదించారు.

➡ డోన్ నియోజకవర్గంలో 33 నామినేషన్లు దాఖలు కాగా 31 ఆమోదించగా 2 నామినేషన్లు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి నామినేషన్లు ఆమోదించారు.

➡ నందికొట్కూరు నియోజకవర్గంలో 47 నామినేషన్లు దాఖలు కాగా 32 ఆమోదం పొందగా 15 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దారా సుధీర్, టీడీపీ అభ్యర్థి జయసూర్య నామినేషన్లు ఆమోందించారు.

➡ బనగానపల్లె నియోజకవర్గంలో 42 నామినేషన్లు దాఖలు కాగా 37నామినేషన్లు ఆమోదం పొందగా 5 నామినేషన్లు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డి, టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి నామినేషన్లు ఆమోదించారు.

అక్కచెల్లెమ్మలూ.. ఆలోచించండి



ముసలాయి చెర్వు గ్రామంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

- సంక్షేమ పథకాలు ఇచ్చే జగన్ కావాలా.. చెవిలో పూలు పెట్టే చంద్రబాబు కావాలా?
- టీడీపీ సూపర్ సిక్స్ అంటే మరో మోసం ఫిక్స్
- స్థానికేతరులను తరిమికొట్టండి
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తూ మహిళలను అక్కచెల్లెమ్మల్లా చూసుకునే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలా.. మోసపూరిత హామీలతో చెవిలో పూలు పెట్టే చంద్రబాబు నాయుడు కావాలా? ఆలోచించుకుని ఎన్నికల్లో ఓటు వేయాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలపరిధిలోని కొలుముల పల్లె, ముద్దవరం, ముసలాయిచెర్వు, బలపాలపల్లె, మర్రికుంట, ఎం.పెండేకల్లు గ్రామాల్లో మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మంత్రికి మహిళలు మంగళహారతులు పట్టగా, ప్రజలు, యువకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గజ మాలలు వేసి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధంగా లేమని, సమయం కావాలని టీడీపీ నాయకుడు చంద్రబాబు కేంద్రాన్ని అర్థించడం వలనే ఏపీలో ఎన్నికలు ఆలస్యమయ్యాయన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ మరో మోసం ఫిక్స్ అని మంత్రి ఎద్దేవా చేశారు.. బూటకపు హామీలతో ప్రజల ఓట్లను బుట్టలో వేసుకొని, గెలిచిన తర్వాత ప్రజలను వంచించిన చరిత్ర టీడీపీది అన్నారు. 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు నాయుడును నమ్మవద్దన్నారు. ఓట్ల కోసం ఇంటి దగ్గరకు వచ్చే టీడీపీ నాయకులను గత హామీలను గుర్తు చేసి నిలదీయాలన్నారు. సొంతూరు అభివృద్ధి పట్టని టీడీపీ అభ్యర్థి కోట్లకు నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా కనిపిస్తుందన్నారు. ఎన్నికల్లో స్థానికేతర్లను తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ భవనమైన బీసీ హాస్టల్ నిర్మాణానికి ఎర్రమట్టిని తరలిస్తుంటే అడ్డుపడిన వారికి ఎన్నికల తరువాత సమాధానం చెబుతామన్నారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే తనకు, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డికి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలీ, ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళి, సర్పంచ్‌లు చిన్న మద్దమ్మ, తిమ్మయ్య ముచ్చు రామక్క, ఎంపీటీసీలు మరియమ్మ, మధు, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభోత్సవం

- గుమ్మడి, కొబ్బరి, నిమ్మకాయలతో భ్రమరాంబాదేవికి సాత్వికబలి
- స్త్రీ వేషధారణలో పురుషుడు అమ్మవారికి కుంభహారతి
- అమ్మవారి నిజరూప దర్శనంతో పులకించిన భక్తులు





సాత్వికబలిగా అమ్మవారికి గుమ్మడికాయలను సమర్పిస్తున్న అర్చకులు, ఉత్సవంలో పాల్గొన్న స్థానికులు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం జగన్మాత అయిన శ్రీశైల భ్రమరాంబాదేవికి సంప్రదాయబద్ధంగా శుక్రవారం వార్షిక కుంభోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారాలలో ఏ రోజు ముందుగా వస్తే ఆ రోజు అమ్మవారికి సాత్వికబలిని సమర్పించేందుకు ఈ విశేష ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా శ్రీభ్రమరాంబాదేవి ఆలయాన్ని నిమ్మకాయల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంభోత్సవంలో భాగంగా ముందుగా ఉదయం అమ్మవారి ఆలయంలో రజకునిచే ప్రత్యేక రంగవల్లిని వేయించారు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పం పఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా జరిపించారు. శాంతి ప్రక్రియగా అధిక పరిమాణంలో పసుపు, కుంకుమలను కూడా అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ఏకాంతంగా పూజాదికాలను జరిపిన తరువాత సాత్వికబలికి సిద్ధం చేయబడిన రెండు వేలకుపైగా కొబ్బరికాయలు, ఐదు వేల గుమ్మడికాయలు, లక్షకుపైగా నిమ్మకాయలు, వండిన అన్నం (కుంభం)కు కూడా పూజాదికాలు జరిపించారు. స్థానిక వ్యాపార సంఘం వారు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, వండిన అన్నం అమ్మవారికి సాత్వికబలిగా సమర్పించారు. అనంతరం హరిహరరాయగోపుర ద్వారం వద్దగల మహిషాసురమర్ధిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేక పూజాదికాలు జరిపి, సాత్వికబలిగా కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయంలో రజకునిచే ప్రత్యేక ముగ్గు వేయించబడి శ్రీచక్రం వద్ద విశేషపూజలు నిర్వహించారు. సాయంకాలం శ్రీమల్లికార్జున స్వామివారికి ప్రదోషకాలపూజల అనంతరం అన్నాభిషేకం జరిపించారు. అలాగే సాయంత్రం అమ్మవారికి ఎదురుగా ఉండేవిధంగా సింహమండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా సమర్పించారు.

అమ్మవారికి కుంభహారతి

సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించారు. దీంతో ఉత్సవంలో ప్రధానఘట్టం ప్రారంభమైంది. కుంభహారతి కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి నిజరూపదర్శనం

శ్రీభ్రమరాంబాదేవి విశేషపూజాదికాలు నిర్వహించిన అనంతరం అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కలిగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. చివరిగా అమ్మవారికి పునఃపూజలను చేసి పలు రకాల వంటకాలతో అమ్మవారికి మహానివేదన చేశారు. ఉత్సవంలో భాగంగానే గ్రామదేవత అంకాళమ్మకు కూడా ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు.



అమ్మవారి ఆలయం వద్ద కుంభ అన్నరాశి

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం జిల్లాకు సాధారణ, పోలీసు పరిశీలకులు వచ్చారని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనల ఉల్లంఘన, శాంతి భద్రతలు తదితర ప్రాథమిక ఫిర్యాదులపై ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ క్యాంప్ కార్యాలయంలో ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుండి 5గంటల వరకు ఫోన్ నెంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు.

➡ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీశైలం, నందికొట్కూరు, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు పంకజ్ కుమార్ 6281860213, 08514 – 293917, మెయిల్ ఐడీ go.17 nandyal@gmail.com లో ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా అన్నవి దినేష్ కుమార్ 9346500440 08514 – 293910 మెయిల్ genaralobserverndl@gmail.com అందుబాటులో ఉంటారన్నారు.

➡ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీశైలం, నందికొట్కూరు, డోన్, ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పోలీస్ అబ్జర్వర్ హిమాన్సు శంకర్ త్రివేది 6300633826, 08514 – 293913 pcnandyalpoliceobserver@gmail.com లో అందుబాటులో ఉంటారన్నారు.



గెలుపుపై ధీమా: బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భారీగా హాజరైనప్రజలు



ప్రగతి దారుల్లో ప్రజాశీస్సులు: బేతంచెర్ల మండలం కొలుములపల్లె గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



'గుర్తు'ంచుకోండి: నందవరం మండలం ఇబ్రహీంపురంలో రోడ్‌షోకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) ఫ్యాన్ గుర్తును చూపుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



ప్రభం'జనం': నంద్యాల 39వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రచారానికి భారీగా తరలివచ్చిన ప్రజలు



ఇదే మనగుర్తు: బనగానపల్లె మండలం క్రిష్టగిరి గ్రామంలో ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అవ్వకు అభయం: గూడూరు మండలం ఆర్.ఖానాపురంలో వృద్ధురాలిని పలకరిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్



సం'క్షేమ' పాలన: ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కల్లూరులోని గణేష్ నగర్‌లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రచారం



అభివృద్ధే మన ఎ'జెండా': శిరివెళ్ల మండలం మహదేవపురంలో రోడ్‌షో చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ప్రచార పర్వం: ఓటర్లూ.. దీవించండి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రచార పర్వం ఊపందుకుంది. అభ్యర్థులు.. ఉదయం, సాయంత్రం ఓటర్లను కలుస్తూ తమను గెలిపించాలని కోరుతున్నారు. అధికారంలోకి వస్తే ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామో వివరిస్తున్నారు. ఐదేళ్ల పరిపాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించామని మళ్లీ గెలిపిస్తే మరింత మంచి చేస్తామని చెబుతున్నారు. మహిళలను, వృద్ధులను, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. భారీగా తరలివచ్చిన ప్రజలతో రోడ్‌షోలు నిర్వహిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షినెట్‌వర్క్



మంచికి ఓటెత్తాలి: పత్తికొండ మండలం జూటూరు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



గెలిపిస్తే ప్రయోజనకరం: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి



అండా'దండా' మీరే: ఆదోని మండలం జి.హొసళ్లిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామప్రజలు



ఆశీర్వదించండి: కర్నూలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

వ్యక్తి అనుమానాస్పద మృతి

నందికొట్కూరు: పట్టణంలోని ఓ లాడ్జిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మండల పరిధిలోని జంగంపాడు గ్రామానికి చెందిన మండ్ల అయ్యన్న, శేషమ్మ దంపతుల కుమారుడు రాజు (34) ఈ నెల 23వ తేదీన లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నా డు. గురువారం రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన రాజు శుక్రవారం ఉదయం గది తలుపులు ఎంత తట్టి నా తీయకపోవడంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు తలుపు లు పగులగొట్టి చూడగా రాజు మృతి చెంది కనిపించా డు.మృతుడి తల్లి శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ని మిత్తం ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు.

ఎమ్మిగనూరు సమితి మాజీ ఉపాధ్యక్షులు దేవేంద్రగౌడ్ మృతి



ఎమ్మిగనూరు: ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ సంఘటిత వేదిక రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ వై.దేవేంద్రగౌడ్(77) శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5.15గంటలకు మృతి చెందారు. ఇటీవల ఆయన గుండెకు రెండవసారి శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం నిమోనియాకు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామంలో 1947లో ఆయన జన్మించారు. ఆయన తండ్రి వై.గాదిలింగన్నగౌడ్ కర్నూలు పార్లమెంట్ సభ్యులుగా, ఆయన సోదరుడు వైసీ వీరభద్రగౌడ్ ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలగా జిల్లాప్రజలకు సుపరిచుతులు. ఎల్‌ఎల్‌బీ చదివిని దేవేంద్రగౌడ్ వారసత్వ రాజకీయాలతో రాజకీయ నాయకుడుగా ఎదిగారు. గుడేకల్ గ్రామ సర్పంచ్‌గా, ఎమ్మిగనూరు సమితి ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 1985లో ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. జనతా పార్టీ, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో ఆయన సేవలందించారు. ఆయనకు భార్య నీలమ్మ, ముగ్గురు కూతుళ్ల సంతానం. శనివారం సాయంత్రం ఎమ్మిగనూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూర్ రూరల్: మంత్రాలయం, పెద్దకడబూర్ మండలాల్లో భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడ్డ మద్యాన్ని, బైకులను మీడియాకు చూపించారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం రాంపురం సమీపంలోని పంప్ హౌస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా.. కోసిగి మండలం చిన్న బొంపల్లికి చెందిన హరికృష్ణ, గౌరైల ఉసేని రెండు బైకులపై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. వారి వద్ద 10 బాక్సుల కర్ణాటక స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.23 లక్షలు ఉంటుందని చెప్పారు. అలాగే మాధవరం చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న పెద్దకడబూరుకు చెందిన వడ్డె నాగరాజును పట్టుకుని 192 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అక్రమ రవాణాపై గట్టి నిఘా

- ఎస్పీ కృష్ణకాంత్



సుంకేసుల చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

గూడూరు: ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచాలని చెక్‌పోస్టు సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. సుంకేసుల చెక్ పోస్ట్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంగా ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు లభ్యమైతే సీజ్ చేయాలన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస రెడ్డి, సెబ్ సీఐ మల్లిక, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ శ్యామల, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య ఉన్నారు.

రూ.13 లక్షలు సీజ్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని అవుకుమెట్ట సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో రూ.13 లక్షలు సీజ్ చేసినట్లు సీఐ గంటాసుబ్బారావు శుక్రవారం తెలిపారు. కొలిమిగుండ్లకు చెందిన మహేశ్వర రెడ్డి కారులో కర్నూలు వెళ్తుండగా కారును సోదా చేశారు. బ్యాగ్‌లో ఉన్న రూ.13 లక్షలకు సరియైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి నంద్యాల ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. వాహనాల తనిఖీలో ఎస్ఐ రామిరెడ్డి, పంచాయతీరాజు ఏఈ ఇబ్రహీంఖాన్, బుచ్చెన్న తదితర సిబ్బంది ఉన్నారు.

మోడల్ ప్రాజెక్టుగా బనవాసి నర్సరీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన 2.0 వాటర్ షెడ్ నిధులతో బనవాసి సెంట్రల్ నర్సరీని మోడల్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో వాటర్‌షెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెంటల్ నర్సరీకి 25 ఎకరాల భూమి ఉందని, దీనిని రాష్ట్రానికే మోడ ల్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే సెంట్రల్ నర్సరీ డ్రీమ్ ప్రాజెక్టుగా రూపుదిద్దుకుందని, మరింత కష్టపడితే రాష్ట్రానికే మోడల్ ప్రాజెక్టు అవుతుందని తెలిపారు. ఇందులో అన్ని రకాల మొక్కలు ఉండాలని,ప్రధానంగా మెడిసినల్ ప్లాంట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫాం పాండ్స్ తవ్వాలని సూచించారు.సమీక్షలో వాటర్‌షెడ్ అదనపు పీడీ మాధవీలత పాల్గొన్నారు.

హంద్రీతీర గ్రామాల నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



హంద్రీ నదిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని హంద్రీ నది తీర గ్రామాల ప్రజల నీటి సమస్యను తీర్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజనీరు బీ నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో హంద్రీనదిలో నీరు లేకపోవడంతో కోడుమూరు మండలంలోని 12 గ్రామాలకు చెందిన నీటి పథకాలను (వర్కూరు నుంచి అనుగొండ వరకు), గూడూరు మండలంలోని గుడిపాడు, కే నాగలాపురం, బూడిదపాడు కుంటలను జీడీపీ నీటి ద్వారా రీచార్జ్ చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలోనే హంద్రీ నదితో పాటు తీర ప్రాంతాలను పరిశీలించామన్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా జలవనరులు ఎండి పోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే హంద్రీ నది నీటిపై ఆధారపడిన ఈ గ్రామాలు తీవ్ర మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు జీడీపీ/ ఎల్ఎల్‌సీ నీటిని హంద్రీ నదికి విడుదల చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది మార్చి 13 నుంచి 25వ తేదీ వరకు విడుదల చేసిన నీరు గోరంట్ల గ్రామం వరకు మాత్రమే వచ్చిందన్నారు. ప్రస్తుతం నీటి సమస్యను అధిగమించేందుకు 50 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేయాలని నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీరుకు లేఖ రాశామన్నారు. హంద్రీ తీర ప్రాంతాలతో పాటు కోడుమూరు మండలంలోని రామచంద్రాపురం, గూడురు మండలంలోని మల్లిమానుచెరువు (కే నాగలాపురం), చాంద్రాయణతిప్ప (బూడిదపాడు)ను నింపుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన



ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఫైళ్లు తనిఖీ చేస్తున్న ఎన్నికల పరిశీలకులు

నంద్యాల: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. నంద్యాల పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్.మణికందన్, టికరాం మీనా ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక జిల్లాలో అధికారులు సీజ్ చేసిన నగదు వివరాలతో పాటుగా అభ్యర్థుల ఖర్చులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనటరింగ్ కమిటీ గుర్తించిన ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రచురితమవుతున్న పత్రికలు, వాటి ద్వారా వస్తున్న వార్తలు, జిల్లాలో ప్రసారం అవుతున్న లోకల్, శాటిలైట్ చానల్స్ వివరాలు, వాటిపై ఏర్పాటు చేసిన నిఘా, తదితర అంశాలను జిల్లా పౌర సంబంధాల అధికారి మల్లికార్జునయ్యను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అన్ని టీంలు సమర్థవంతంగా పనిచేసి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కాలు జారిపడి ఉపాధ్యాయురాలి మృతి

కర్నూలు: కాలు జారిపడి తలకు బలమైన గాయాలై ఉపాధ్యాయురాలు మృతిచెందింది. కల్లూరు మండలం గీతానగర్‌లో నివాసముంటున్న గాయత్రి (54) గూడూరు మండలం పెంచికలపాడు జెడ్పీహెచ్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఈమె కుమారుడు ఉద్యోగ వేటలో బెంగళూరులో ఉండగా, కుమార్తె ఆరు నెలల గర్భవతి కావడంతో పుట్టింట్లోనే ఉంటోంది. గురువారం రాత్రి కుమార్తెకు పళ్ల రసాన్ని తీసుకురావడానికి వంట గదిలోకి వెళ్లింది. నేలపై తడి ఉండటంతో కాలు జారి కింద పడి తలకు వెనుకభాగంలో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

కర్నూలు: కర్నూలు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే తుంగభద్ర రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అలంపూరు రోడ్, మానవపాడు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 30 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియవు. దాదాపు 5.6 అడుగుల ఎత్తు, చాక్లెట్ కలర్ రెడీమేడ్ నలుపు రంగు గళ్ల డిజైన్ గల ఫుల్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నీలిరంగు కట్ డ్రాయర్ ధరించాడు. కుడి చేతిపై అమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. రెడ్‌మీ మొబైల్ ఫోన్, కింగ్స్ చేతి గడియారం పగిలిపోయి ఉన్నాయి. రోల్డ్‌గోల్డ్ దండ తెగిపోయి ఘటనా స్థలంలో పడి ఉంది. సమాచారం తెలిసినవారు కర్నూలు రైల్వే పోలీసులు లేదా గద్వాల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ కోరారు.

రూ. 2 లక్షలు స్వాధీనం

చాగలమర్రి:మల్లెవేముల గ్రామ సమీపంలోని పోలీసు చెక్ పోస్టు వద్ద శుక్రవారం వాహన తనిఖీల్లో రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాట్లు చెక్ పోస్టు సిబ్బంది తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడురు గ్రామానికి చెందిన టి. సునీల్ కుమార్ స్కూటీపై నంద్యాల నుంచి చౌదురుకు వెళ్తుండగా మల్లెవేముల అంతర్ జిల్లా పోలీసు చెక్ పోస్టు వద్ద తని ఖీ చేశారు. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా డిక్కీలో ఉన్న రూ. 2 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమదు చేశారు.

జూన్ 29న జాతీయ లోక్‌అదాలత్

కర్నూలు (లీగల్): సాధారణ ఎన్నికలు, వేసవి దృష్ట్యా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మే 11న నిర్వహించా ల్సిన జాతీయ లోక్‌అదాలతను జూన్ 29వ తేదీన జరపాలని ఆదేశాలు జారీ చేసిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్,ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.